

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# నిర్ణయం

రమణయ్య రిటైరై పదేళ్ళు అయింది. రిటైర్ అయినప్పుడు వచ్చిన డబ్బు అంతా కొడుకుల చదువులకు, వాళ్ళ ఉద్యోగాలు తెచ్చుకునేందుకు ఖర్చు చేశాడు.ఆయనకు వచ్చే పెన్షన్ అయనకూ, భార్యకూ తిండికి సరిపోతుంది. ఆయనకు ఉన్న దిగులల్లా ఆడపిల్ల పెళ్ళి కాలేదనే.

జయప్రద అందమైన పిల్ల. తెలివి గలది. సంబంధాలు చూస్తున్నారు. గట్టిగా ప్రయత్నిస్తే ఏదో ఒక సంబంధం కుదురుతుంది. కానీ ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి చేయటమంటే మాటలా ?

జయప్రద ఇంట్లోంచి బయల్దేరింది.

"ఎక్కడికే ?" తల్లి అడిగింది.

"మా ఫ్రెండ్ ఇంటికెళ్ళొస్తాను" అంటూ బయల్దేరింది. జయప్రద. ఆమె చేతిలో వారపత్రిక ఉంది. అందులో .....

జయప్రద తలొంచుకొని నడుస్తోంది. వీధి చివరికి వచ్చేటప్పటికి ప్రకాష్ సైకిల్ షాపు దగ్గిర కనిపించాడు. జయప్రద అతన్ని చూడనట్లు నడుస్తోంది. ఆమెకు నాలుగు అడుగుల దూరంలో అతను నడుస్తున్నాడు. అతని చేతిలోనూ వారపత్రిక ఉంది. అందులో ......

ఆమె పుస్తకాలు అద్దె కు ఇచ్చే షాపు లొకి వెళ్ళింది. ఆమె వెనకే ప్రకాష్ వెళ్ళాడు. ఆ షాపు లోని కుర్రాడికి ఆమె పత్రిక ఇచ్చింది. ఆమె వాపసు చేసిన పత్రికను ప్రకాష్ తీసు కున్నాడు.

అతను వాపసు చేసిన పత్రికను ఆమె తీసుకుంది. క్షణం సేపు ఇద్దరి చూపులు ఒరుసు కున్నాయి. ఆమె పెదవుల పైన చిరునవ్వు తొణికిసలాడింది. అతను కళ్ళతో మాట్లాడాడు. కొత్తగా ప్రేమించుకున్న వాళ్ళకి మాటలు తడబడుతుంటయి. నోరు ఎండి పోతుంది. అందుకని కళ్ళతోనే పలకరించుకుంటారు. మౌనంగానే మాట్లాడుకుంటారు.

జయప్రద పత్రికను గుండ్రంగా చుట్టి పట్టుకుంది. అతనూ అంతే.

ప్రకాష్ షాపు కుర్రాడిని అడిగాడు. " ఏరా, ఎం సినిమాలు చూసావు ? " అని.

"సీతారాముల కల్యాణం"

"బావుందా ? "

"సూపరు"

జయప్రద నవ్వింది. ప్రకాష్ కు ఏనుగును ఎక్కినట్లుంది.

"మ్యాటినీకి ఎల్దాం వస్తావా ?" అని అడిగాడు ఆమె వంక చూస్తూ.

"వీలు పడదండి." అన్నాడు వాడు. ఆమె మాత్రం నవ్వీ నవ్వనట్లు నవ్వుతూ తల అడించింది.

ఇంటికి వచ్చేలోపల ఆ మేగజైన్లో వున్న లెటర్ ను తీసి దాచేసుకుంది. ఇంటికి వెళ్ళాక తీసి చదువుకుంది.

"ప్రియా, జయా,

నేను ఇంతకు ముందు రాసిన లెటర్ చూసావు కదా. ఎంతో నిరామయంగా గడిచి పోతున్న నా జీవితంలోకి గలగలా పారే సెలయేరులా ప్రవేశించావు. కళ్ళకు కలలు కనటం నేర్పావు. మనసుకు ఊహల మీద విహరించటం నేర్పావు. నిర్లిప్తంగా రోజులు నెట్టుకు పోతున్న నాకు ఎన్నో సుందర మధుర స్వప్నాలను చూపించావు. నీవు ఎక్కడుంటే అక్కడ వెన్నెల మడుగులు. నీవు సిగ్గులు ఒలక పోస్తుంటే మల్లెలు కురుస్తున్న భావన. నువ్వు పక్కన వుంటే ఎవరెస్టు శిఖరం ఎక్కినట్లు, నువ్వు వెళ్ళి పోతే లోయల్లోకి జారి పోయినట్లు... ఎన్ని అనుభూతులను మూటగట్టుని వస్తావు ? అయినా ఏమి ఎరగనట్లు ఎంత అమాయకత్వాన్ని ప్రదర్శిస్తావు ? ..."

ఎవరో వస్తున్న అలికిడి అవటంతో ఉత్తరం దాచేసింది.

" ఇక్కడ ఏం చేస్తున్నావు ? " అని అడిగింది వదిన.

"ఏం లేదు. పుస్తకం చదువు కుంటున్నాను. " అన్నది జయప్రద. అక్కడి నుంచీ పక్క గది లోకి వచ్చింది. తల్లీ తండ్రీ మాట్లాడు కుంటున్నారు.

"గుంటూరు సంబంధం వాళ్ళు కబురు చేశారు. పిల్ల నచ్చిందిట. మిగిలిన విషయాలు మాట్లాడు కొవటానికి రమ్మన్నారు...." అన్నాడు ఆయన,

"వాళ్ళతో మాట్లాడే ముందు, మనవాళ్ళతో మాట్లాడాలి గదా...రిటైరు అయినప్పుడు మీకు వచ్చిన డబ్బు కాస్తా మగపిల్లల చదువులకనీ, వుద్యోగాలకనీ, వాళ్ళ పెళ్ళిళ్ళకని, వాళ్ళ పిల్లల చదువులకని, దేనికీ, ముందూ వెనుకా చూడకుండా ఖర్చు చేసారు. చేతులు దులుపుకుని కూర్చున్నారు. ఇప్పుడు పిల్ల పెళ్ళి చెయ్యాలంటే, తలా కాస్త విదిపితే గాని పెళ్ళి జరగదు. తప్పదుగదా, వాళ్ళను కదిపి చూడండి..." అన్నదామె.

ఆమె సలహా మేరకు, ముగ్గురు కొడుకులనూ అడిగాడు.. మూడొ కొడుకు తన కష్టాలన్నీ ఏకరువు పెట్టి, పాతిక వేలకన్నా ఎక్కవ ఇవ్వలేనన్నాడు. సమాన బాధ్యతలు కాబట్టి, మిగిలిన వాళ్ళూ అంతే ఇస్తామన్నారు.

"అంతా కలిపినా డెబ్బయి వేలకన్నా ఎక్కవ చేతిలో వుండదు. ఈ రోజుల్లో ఆ కాస్త డబ్బు ఏ మూలకు సరిపోతుంది..." అన్నది తల్లి.

"వీటికి అంతు ఎక్కడ ? ఎంత వుంటే అంతలోనే సర్దు కోవాలి..." అన్నాడు పెద్ద కొడుకు. తండ్రికి సాయపడాలని కొడుకులకు ఏ మూలనన్నా కాస్త జాలి వున్నా, కోడళ్ళు వెనక నుంచి పగ్గాలు వేసి లాగుతున్నారు.

కూతురి పెళ్ళి చేయటం తనవల్ల అయ్యే పని కాదని రమణయ్య కు తెల్సి వచ్చింది.

జయప్రద సినిమా హాలు దగ్గర క్యూ లో నిలబడింది. ప్రకాష్ ఆమె దగ్గరి కొచ్చి తనకూ ఒక టిక్కెట్ తీసుకోమన్నాడు. సినిమా హాల్లో అతని పక్కన కూర్చోవటం ఆమెకు వింత అనుభవాన్ని కలిగిస్తోంది. హీరో హీరోయిన్ల ప్రేమ సన్నివేశం వచ్చినప్పుడు అతను అమె చెయ్యి మీద చెయ్యి వేశాడు. యుగళ గీతం వచ్చినప్పుడు ఆమె చెవిలో ఏదో గొణిగాడు. ఆమె నవ్వింది. అతను మరింత చొరవ తీసుకున్నాడు. కామెడీ సీన్స్ వచ్చినప్పు ఆమె భజం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నాడు.

సినిమా అయి పోయేటప్పటికి ఇద్దరూ బాగా సన్నిహితులై పోయారు. విడవలేక విడవలేక విడిచి వెళ్ళారు.

ఇంటికి వెళ్ళింది. అక్కడ పరిస్తితి అలాగే ఎటూ తేలకుండా వుంది. మంచి సంబంధం ఎలా వదులు కుంటాం అని తల్లి తండ్రీ ఎంత పోరుతున్నా కొడుకులు మాత్రం కనికరించటం లేదు. వెనక నుంచి కోడళ్ళు కంట్రోల్ చేస్తూనే వున్నారు.

జయప్రదకు ప్రకాష్ ఈ గండాన్ని గట్టెంక్కించే దేవుడు లా కనిపిస్తున్నాడు. ఇద్దరి మధ్యా ప్రెమ లేఖల జోరు ఎక్కువైంది. పార్క్ లో పొదలచాటున చేరి గుసగుసలాడు కుంటున్నారు..

ఒక రోజు జయప్రద ప్రకాష్ తో సినిమాకు వెళ్ళటం పెద్ద కోడలు కంట పడింది. ఇంట్లో అందరితో చెప్పింది. పెద్ద గొడవ జరిగింది.

తామిద్దరు ప్రేమించుకుంటున్నామని, పెళ్ళి చేసుకుంటామని చెప్పింది. ఆమె ఎంత ప్రాధేయపడినా ఎవరూ ఆమెను అర్ధం చేసుకోలేదు.

ఒక్క తల్లి మాత్రం ఆమెను అశీర్వదించింది. " అతను ఎవరైనా ఫర్వాలేదు...మీరు సంతోషంగా వుండ గలిగితే చాలు ..."

కొండంత ఆశతొ అతని వద్ధకు వెళ్ళిన జయప్రద కు నిరాశే ఎదురైంది. "తొందర పడ్డావు జయప్రదా.. మా ఇంట్లో వాళ్ళు వొప్పుకొవటం లేదు..."

"మాఇంట్లొ వాళ్ళూ వొప్పుకోలేదు... అయినా ధైర్యం చేసి వచ్చాను...నీ మీద నమ్మకంతో..." అన్నది జయప్రద.

"నాకు మా వాళ్ళు ముఖ్యం ... నేను వాళ్ళను వదులు కోలేను..."

" వాళ్ళను వదులు కుంటే .. ఆస్తీ రాదని భయం... అంతేనా....?"

అతను మాట్లాడ లేదు...

ఆమెకు ఎక్కడికి పోవాలో తెలియ లేదు. ప్రపంచం చాలా విశాల మైనది. ఆమె నడుస్తుంటే.. కొంత దూరం వెళ్ళాక ఎదురుగా స్త్రీ ల స్వయం ఉపాధి కేంద్రం కనుపించింది. జయప్రద అందులోకి నడిచింది...

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.